# పెద్దల సబ్బాతుబడి పాఠములు

# పరలోకము మరియు భూమి ఐక్యపర్చబడెను ఫిలిప్పీయులకు మరియు కొలొస్సయులకు వ్రాసిన పత్రికలలో యేసును గూర్చి నేర్చుకొనుడి

## మొదటి త్రైమాసం-2026



జనవరి, ఫిబ్రవరి, మార్చి -2026


గ్రంథకర్త

**క్లింటన్ వాహ్ లెన్**

అనువాదం

**చింతా ప్రకాష్**

7వ పాఠం ఫిబ్రవరి 7-13

# పరలోకమునందు దేవుని యొక్క కుటుంబములో ఒక సభ్యుడు

**సబ్బాతు మధ్యాహ్నము ఫిబ్రవరి 7**

**ఈ వారమునకు చదువ వలసిన వచనములు : ఫిలిప్పీ 3:17-19; ఫిలిప్పీ 3:20, 21; ఫిలిప్పీ 4:4-7; ఫిలిప్పీ 4:8,9; ఫిలిప్పీ 4:10-13,19.**

**కంఠతవచనం : "దేనిని గూర్చియు చింతపడకుడి గాని ప్రతి విషయములోను ప్రార్థన విజ్ఞాపనముల చేత కృతజ్ఞతా పూర్వకముగా మీ విన్నపములు దేవునికి తెలియజేయుడి" (ఫిలిప్పీ 4:6).**

ఈ వారము మనము పౌలు ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రికను గూర్చిన అధ్యయనమును సంపూర్తి చేయుదము. పౌలు ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రికలో ఎన్నో అమూల్యమైన పాఠములు, సలహాలు, అనుదిన జీవితమునకు అవసరమైన సూక్తులతో నిండియున్నది. పౌలు అనేకమైన సూక్తులను ఈ పత్రిక యొక్క చివరి వచనాలలో పొందుపరచెను. పౌలు మాటలు, యేసు జీవితమును పోలినవిగా ఉన్నవి. సంతోషకరమైన విశ్వాసముతో నిండిన జీవితమును యేసును వెంబడించేవారు ఏవిధముగా కలిగియుండగలరో యేసు బోధించెను ఆనందకరమైన క్రైస్తవ జీవితమును ఏవిధంగా జీవించగలమో పౌలు కూడా మనకు బోధించుచున్నాడు.

మనకు ఇష్టములేని అనేక విషయాలు తరచుగా మన జీవితములో సంభవిస్తూ ఉంటాయి. అయితే వాటిని గూర్చి మనము ఆందోళన చెందనవసరము లేదు. మన సమస్యలను పరిష్కరించుకొనుటకు, బలముగా నిలువబడుటకు ముఖ్యమైన అనేక నియమములను బైబిలు మనకు అనుగ్రహించుచున్నది. అందువలననే మనము వాటి విషయమై ఆందోళన చెందనవసరము లేదు. దేవుడు సమాధానముతో నింపుటకు ఆయనను అనుమతించాలి. అమూల్యమైన ఆ సమాధానమును దేవుడు మనకు ఇచ్చును. మన భవిష్యత్తును అదుపు చేయువాడు మన జీవితాలను నియంత్రించుచున్నాడు. మనకు అవసరమైన ప్రతి విషయమును దేవుడు మనకు అనుగ్రహించును.

అన్నిటికన్నా ప్రాముఖ్యమైనదిగా మనకు నిరీక్షణ లేక సమాధానము దొరుకుట కొరకు ప్రభుత్వాల మీద లేక వారి నాయకుల మీద మనము ఆధారపడనవసరములేదు. క్రైస్తవులముగా పరలోకపు కుటుంబ సభ్యులతో భాగమైయున్నాము. దేవుని యొక్క రాజ్యములో సభ్యులముగా దేవుడు మనకు అనేక దీవెనలను అనుగ్రహిస్తాడు. దేవునిని సేవించాలని కూడా ఆయన కోరుచున్నాడు.

–ఫిబ్రవరి 14, సబ్బాతుదినమున, ఈ వారమునకు ఏర్పాటు చేయబడిన సబ్బాతు బడి పాఠమును అధ్యయనము చేయుటకు సిద్ధపడుడి.

ఆదివారం ఫిబ్రవరి 8

## మంచి మాదిరులు (ఫిలిప్పీ 3:17-19)

చాలా దుర్మార్గమైన కాలములలో పౌలు జీవించాడు. మనము జీవించుచున్న ఈ దినములలో కూడా ఆవిధముగానే ఉన్నది. మనముందున్న ప్రశ్న ఏమిటంటే మన చుట్టూ ఎంతో దుర్మార్గపు వాతావరణము ఉండగా మనము ఏవిధముగా ప్రవర్తించుచున్నాము?

**ఫిలిప్పీ 3:17-19 చదువుడి. పౌలు మంచి చెడుల మాదిరులు గూర్చి మాట్లాడుచున్నాడు. ఏమిటీ మంచిచెడుల మాదిరులు? ఏది మంచి మాదిరి ఏది చెడ్డ మాదిరి అని ఎట్లు తెలుసుకొనగలము?**

పౌలు ఎవరి అభిప్రాయములను అంగీకరించాడో వారి యెడల తన ప్రేమను కనుపరుస్తాడు. వారి నిమిత్తమై పౌలు దుఃఖించెను. వారు ఆయన వ్యక్తిగత శత్రువులని పౌలు కూడా చెప్పలేదని మీరు గమనించారా? నిజముగా "క్రీస్తు సిలువకు వారు శత్రువులు" అని పౌలు చెప్పాడు. (ఫిలిప్పీ 3:18) వారికి రక్షకుడు అవసరమైన పాపులని పౌలు గ్రహించెను (ఎఫెసి 2:11-14 చదువుడి) మనందరము రక్షకుడు అవసరమైన పాపులమే. ఏ బేధములేదు మనందరికి యేసు అవసరమైయున్నాడు. అందరికి యేసు అవసరము కాబట్టి అందరూ ఒకే స్థితిలో ఉన్నవారము.

చెడ్డ మాదిరి కాకుండా మంచి మాదిర్లు గూర్చి ఆలోచించండి అని పౌలు ఫిలిప్పీయులకు సూచించుచున్నాడు. అతనివలె జీవించే వారిని జాగ్రత్తగా పరిశీలించి తెలుసుకోమని విశ్వాసులను పౌలు కోరుచున్నాడు. అంతట ఫిలిప్పీయులు వారు జీవించుచున్న విధానమును చూచెదరు. రోమీయులకు వ్రాసిన పత్రికలో కూడా పౌలు ఇట్టి వర్తమానమునే వ్రాసాడు. ఈవిధముగా వారిని హెచ్చరించెను. "సహోదరులారా, మీరు నేర్చుకొనిన బోధకు వ్యతిరేకముగా బేధములను, ఆటంకములను కలుగజేయు వారిని కనిపెట్టి యుండుడని మిమ్మును బతిమాలుకొనుచున్నాను. వారిలో నుండి తొలగిపోవుడి'' (రోమా 16:17). రోములో ఉన్న అబద్ధ బోధకులను ఉద్దేశించి వారు నమ్మదగినవారు కారని పౌలు చెప్పెను. "అట్టి వారు మన ప్రభువైన క్రీస్తుకు కాక తమ కడుపునకే దాసులు. వారు ఇంపైన మాటల వలనను, ఇచ్చకముల వలనను నిష్కపటుల మనస్సులను మోసపుచ్చుదురు" (రోమా 16:18).

**అయితే యేసు ఒక్కడే పరిపూర్ణమైన మాదిరి. అదే సమయములో మనము వెంబడించుటకు కొంతమంది క్రైస్తవులు కూడా మాదిరులుగా ఉన్నారు. ఇప్పుడు మీరు సొంత జీవితాల గురించి ఆలోచించుడి. ఇతర ప్రజలకు మీరు ఎటువంటి మాదిరిని చూపిస్తున్నారు.**

సోమవారం ఫిబ్రవరి 9

## ప్రభువునందు బలముగా ఉండుడి (ఫిలిప్పీ 3:20,21)

**పరలోకములో ఉన్న దేవుని కుటుంబములో సభ్యుడుగా ఉండుటను గూర్చి పౌలు ఏమి చెప్పుచున్నాడు? (ఫిలిప్పీ 3:20,21 చదువుడి)**

సిలువకు శత్రువులుగా ఉన్న వారిని గూర్చి పౌలు మాట్లాడుచున్నాడు. పౌలు ఈవిధముగా చెప్పెను. "నాశనమే వారి అంతము. వారి కడుపే వారి దేవుడు. వారు తాము సిగ్గుపడవలసిన సంగతులయందు అతిశయపడుచున్నారు. భూసంబంధమైన వాటియందే మనస్సునుంచుచున్నారు" (ఫిలిప్పీ 3:19). క్రైస్తవులు పరలోకములోని విషయాలను గురించి ఆలోచిస్తారు. వారు పరలోకములో ఉన్న కుటుంబములో క్రైస్తవులు సభ్యులు కాబట్టి వారు ఆవిధముగా ఆలోచిస్తారు. యేసుక్రీస్తు మన రాజు. "భూమి మీద ఉన్న మనము బలహీనమైన దేహములను కలిగినవారము. అయితే యేసు మన ఈ బలహీన దేహములను మార్చివేస్తాడు అని పౌలు చెప్పుచున్నాడు (ఫిలిప్పీ 3:21) అది సంభవించే వరకు ఈ వ్యాధుల వలన, బాధల వలన, మరియు మరణము వలన కొన్ని ఇబ్బందులను ఎదుర్కొనవలెను.

**ఈ క్రింది వాక్యాలను పరిశీలించుడి. యేసు మనకు అనుగ్రహించబోవు నూతన శరీరములను గురించి ఈ క్రింది వాక్యాలు ఏమి బోధిస్తున్నవి? చదువుడి.**

యోబు 19:25-27 ..........................................................

లూకా 24:39 ..........................................................

1కొరింథి 15:42-44 ..........................................................

1కొరింథి 15:50-54 ..........................................................

కొలొస్సయి 3:4 ..........................................................

చివరిగా మరణమును శాశ్వతముగా యేసు నాశనము చేయును. మరణమే మన చివరి శత్రువు (1కొరింథి 15:26). ఈ వాగ్దానము మనకు నిరీక్షణను అనుగ్రహించును. యేసు మరణమును అంతముగా చేసి మనకు నూతన శరీరమును అనుగ్రహించును (ఫిలిప్పీ 3:21)

అందుచేత పౌలు యొక్క వివరణ ప్రకారము మనము దేవుని కుటుంబములో సభ్యులము కాబట్టి మనకు నిత్యజీవము మరియు పునరుత్థానమునకు సంబంధించిన వాగ్దానము నిలిచే యుండును. యేసు యొక్క రెండవ రాకడ సమయములో, ఆయనకు విధేయులై ఆయనను వెంబడించిన వారు మరణించినను పునరుత్థానము ద్వారా జీవములోనికి వారిని లేపును. అంతట మనకు సంపూర్ణమైన నూతన జీవము కలిగియుందుము. ఈ సరిక్రొత్త నూతన జీవమును గూర్చి మన మనస్సులో చిత్రించుకొనుట కూడా మనకు సాధ్యపడదు.

**క్రైస్తవులముగా మనము నమ్మే విషయాలన్నింటిలో ఎందువలన నిత్యజీవమునకు సంబంధించిన వాగ్దానము చాలా ప్రాముఖ్యము? నూతన జీవము, ఏ విలువైన జీవితము మనకు అనుగ్రహించబోవుచున్నది?**

**మంగళవారం** **ఫిబ్రవరి 10**

## ఎల్లప్పుడు ప్రభువునందు ఆనందించుడి (ఫిలిప్పీ 4:4-7)

**ఫిలిప్పీ 4:4-7 చదువుడి. ఈ వాక్యాలలో పౌలు మాట్లాడుచున్న సమాధానము ఎక్కడి నుండి వచ్చును? మనము దానిని ఏవిధముగా పొందగలము?**

సమాధానము కొరకు క్రైస్తవ సంఘ సభ్యులందరు కలిసి పనిచేయవలెనని పౌలు మాట్లాడుచున్నాడు (ఫిలిప్పీ 4:1-3). అటు తరువాత పౌలు "ప్రభువునందు ఎల్లప్పుడు ఆనందించుడి' అనే నూతన అంశమును మనకు పరిచయము చేస్తున్నాడు (ఫిలిప్పీ 4:4-7).

సమస్యలు సంభవించిన వెంటనే పరిష్కారమయ్యే వాటిని గురించి కూడా ఎంత తరచుగా మీరు వేదనచెందుతూ ఉంటారు? కొన్ని సమస్యలు అంత తీవ్రమైనవి కాకపోయినను తరచుగా అది చాలా భయంకరమైనవిగా కనిపిస్తాయి. మనలను ఆందోళనకు గురిచేసే ప్రతి విషయమును గూర్చి మనము ఎక్కువగా చింతించనవసరములేదని యేసు చెప్పుచున్నాడు. (మత్తయి 6:25-34 మరియు మత్తయి 10:19) మనలను ఆందోళనకు గురి చేసే ప్రతి విషయములోను యేసుపై మన నమ్మకము పెట్టుకొనవలెనని పేతురు చెప్పుచున్నాడు. యేసు మనలను లక్ష్యము చేయుచున్నాడు (1పేతురు 5:7)

ప్రపంచ వ్యాప్తముగా సమస్యలు అధికమవుచుండగా మనము నిరీక్షణ కలిగి యుండాలి. యేసు యొక్క రెండవ రాకడ బహు సమీపముగా ఉన్నదని తెలియజేయుటకు ఈ సమస్యలు గుర్తుగా ఉన్నవి (మత్తయి 24:33, లూకా 21:28; యాకోబు 5:8 పోల్చి చూడుడి).

మనము చెందే ఆందోళనకు, భయమునకు సమాధానము ఏమిటి? విశ్వాసుల యొక్క ప్రార్ధనే వాటికి జవాబు (ఫిలిప్పీ 4:6,7) ఎటువంటి అనుమానము లేకుండా యేసును నమ్మవలెను. ఆయన మన ప్రార్ధనలను ఆలకిస్తున్నాడని విశ్వసించాలి. ప్రార్ధనలకు జవాబు చూడక మునుపే, వాటికి జవాబు ఇవ్వబడినదని నమ్ముచు మనము దాని ప్రకారము నడుచుకొనాలి. కృతజ్ఞతా భావముతో ప్రార్థించాలి. ప్రార్థించేటప్పుడు జవాబు కొరకు దేవునిని అడుగుతాము. (ఈ క్రింది ఉదాహరణలను చదువుము లూకా 1:13; ఫిలిప్పీ 1:19; 1తిమోతి 5:5; యాకోబు 5:16) దేవుడు వాగ్దానము చేసిన వాటిని గూర్చి మనము ప్రార్థించవలెను (1యోహాను 5:14). అప్పుడు మన ప్రార్ధనలకు జవాబునిస్తాడని నమ్మవలెను. అప్పుడు మనము కలవరము చెందకుండా సమాధానము కలిగియుండగలం. ఇటువంటి ప్రార్ధనలను దేవుడు అంగీకరిస్తాడని, జవాబులిస్తాడని తెలుసుకుంటాము.

దేవుని యొక్క సమాధానమును అర్ధము చేసుకొనుటకు ఈ క్రింది వాక్యాలు ఏవిధంగా సహాయపడును? కీర్తన 29:11; యెషయా 9:6; లూకా 2:14; యోహాను 14:27; 1కొరింథి 14:33).

మన ఈ జీవితము దేవుని యొక్క సమాధానమునివ్వదు. దేవుడు మనకిచ్చు శాశ్వత జీవితమనే వరమునందు మనకున్న నిరీక్షణ నుండి దేవుని యొక్క సమాధానము వచ్చును (రోమా 5:1; రోమా 6:23) ఈ సమాధానము నిరీక్షణతో నింపును. దేవుడిచ్చే సమాధానమును పరిపూర్ణముగా అర్ధము చేసుకొనలేము (ఫిలిప్పీ 4:7) అయితే మన జీవితాలలో ఉన్న ప్రతి భాగము దేవుని సమాధానము మార్చగలదని మనకు తెలుసు.

**దేవుని సమాధానము కలిగియుండుట అంటే అర్ధమేమిటి?**

బుధవారం ఫిబ్రవరి 11

**ఈ విషయములను గూర్చి ఆలోచించుడి (ఫిలిప్పీ 4:8,9)**

మనము గ్రహింప శక్యముగాని రీతులో దేవుడు మనకు సమాధానమును అనుగ్రహించుచున్నాడు. ఈ సమాధానము "మీ హృదయమునకును, తలంపులకును కావలిగా వుండును" (ఫిలిప్పీ 4:7) మనము ఆధ్యాత్మిక జీవితములను సంరక్షించుకొనవలెను. ఫిలిప్పీ 4:7లోని 'కావలిగాయుండును' అనే మాట గ్రీకు పదమైన 'ప్రొయురియో' నుండి వచ్చినది. గ్రీకు భాషలో ఒక గుంపునకు చెందిన సైనికులు శత్రువుల దాడి నుండి ఒక పట్టణమును కావలి కాయువారిని సూచించుచు వాడబడే పదము అది. (2కొరింథి 11:32ను అపో.కా. 9:24తో పోల్చి చూడుడి)

మన హృదయములలో సమాధానము కలిగి యుండుటకు మరొక ప్రాముఖ్యమైన భాగము ఏమిటంటే దేవుని యొక్క ధర్మశాస్త్రమునకు విధేయత చూపుట "నీ ధర్మశాస్త్రమును ప్రేమించువారికి ఎంతో నెమ్మదికలదు. వారు తూలి తొట్రిల్లుటకు కారణమేమియులేదు" (కీర్తన 119:165).

**ఫిలిప్పీ 4:8,9 చదువుడి. పౌలు క్రైస్తవ విశ్వాసులకు ఈ వాక్యములలో ఇచ్చిన సలహా ఏమిటి?**

ఫిలిప్పీ 4:8,9లో మన మనస్సులలో నింపబడియుండవలసిన 6 ప్రాముఖ్యమైన విషయాలను పౌలు మనకు పేర్కొనుచున్నాడు. ఆయన మాదిరిని మనము అనుసరించవలసినదిగా ఒక పట్టిక రూపములో ఇవ్వబడిన ఈ ఒక్కొక్క విషయమును గూర్చి పౌలు వివరించాడు. ఈవిషయాలను గూర్చి ఆలోచించవలసినదిగా పౌలు మనలను ప్రోత్సహించుచున్నాడు.

**1. ఏవి సత్యమైనవో :** నేను మీకు సత్యమును చెప్పుచున్నానని యేసు తన బోధనలను ఆరంభించేవాడు. సత్యము దేవునికి చాలా ప్రాముఖ్యమని నూతన నిబంధనలో మనకు తెలియజేయుచున్నది (అపో.కా. 26:25; రోమా 1:18; 1కొరింథి 13:6; 2కొరింథి 4:2; ఎఫెసి 4:15; 1తిమోతి 3:15; యాకోబు 1:18; 1పేతురు 1:22; 1యోహాను 2:21).

**2. ఏవి మాన్యమైనవో :** మనము యేసును ప్రేమించుచున్నాము గనుక, ఆయన సత్యమైయున్నాడు. గనుక ఎల్లప్పుడు నమ్మకముగా ఉండాలి. ఇతర వాక్యములలో ఈ పదము "మాన్యులైయుండి" అని వ్రాయబడెను (1తిమోతి 3:8; 11; తీతు 2:2తో పోల్చి చూడుడి).

**3. ఏవి న్యాయమైనవో :** దేవుడు పరిశుద్ధుడు గనుక ఎల్లప్పుడు ఆయన ఏవి న్యాయమైనవో వాటిని చేయును (ఈ మాటను ఫిలిప్పీ 1:7తో పోల్చుడి).

**4. ఏవి పవిత్రమైనవో :** మన తలంపులు, ప్రవర్తన పవిత్రమైనవిగా ఉండాలి. దేవుని యొక్క పవిత్ర జీవితమును; విశ్వాసముతో అంగీకరిస్తున్నాము. ఆయన జీవితము మనలను పవిత్రముగా చేయును (1యోహాను 3:3 చదువుడి).

**5. ఏవి రమ్యమైనవో :** ఈ పదము ప్రకృతిలో చూచే అందమును గూర్చి మాట్లాడుచున్నది. భూమి మీద దేవుడు అనేకమైన అందమైన విషయాలను సృష్టించెను.

**6. ఏవి ఖ్యాతిగలవో :** ఒక మంచి వ్యక్తి లేక ఖ్యాతి కలిగిన మనిషి, దయ కలిగి సంరక్షించి, ప్రేమించే వ్యక్తిగా ఉంటాడు. ఈ వ్యక్తి ఏవిషయాలలో దేవునికి వందనస్తులమై ఉండాలో ఆలోచిస్తూ ఉంటాడు.

గురువారం ఫిబ్రవరి 12

## సంతోషకరమైన జీవితము కలిగియుండమని పౌలు యొక్క సలహాయై యున్నది (ఫిలిప్పీ 4:10-13, 19)

**ఫిలిప్పీ 4:10-13, 19 చదువుడి. సంతోషకరమైన జీవితమును జీవించుటకై మనకు పౌలు ఇచ్చుచున్న సలహా ఏమిటి?**

కష్ట సమయములు ఎదురైనప్పుడు చాలా ప్రాముఖ్యమైన విషయాలను గూర్చి ఆలోచన చేస్తూ ఉంటాము. ఆకలి, అనారోగ్యము, శ్రమలు, మరియు సంపద కోల్పోవుట వంటి విషయాలు మనము దేవునికి వందనస్తులమైయుండులాగున అవి బోధిస్తాయి. మనము విచారముగా ఉన్నపుడు లేక ఏదైనా అవసరతలో ఉన్నపుడు దేవునియందు మనకున్న విశ్వాసము బలపడుతుంది (ఫిలిప్పీ 4:12).

మనకు సమృద్ధిగా ఉన్నపుడు లేదా అవసరమునకు మించి ఉన్నప్పుడు ఒక క్షణములో వాటన్నిటిని కోల్పోయే పరిస్థితులు ఏర్పడవచ్చు అని మనము గుర్తించుకోవాలి (సామెతలు 23:5). మనము ఈ లోకములో జన్మించినపుడు ఏమియు వెంట తీసుకొనిరాలేదు అని యోబు మరియు పౌలు గుర్తు చేస్తున్నారు. అట్లే మనము మరణించినపుడు సమాధిలోనికి ఏమియు తీసుకుపోము (యోబు 1:21; 1తిమోతి 6:7).

సంతోషకరమైన జీవితమునకు సంబంధించి బైబిలు అనేక ఆశ్చర్యకరమైన వాగ్దానములను ఇచ్చుచున్నది. వాటిలో కొన్నింటిని పరిశీలిద్దాము. ఈ వాక్యములను చదువుడి.

- కీర్తన 23:1 : ..........................................................................
- మత్తయి 6:32 :..........................................................................
- 1పేతురు 5:7 : ..........................................................................
- ఫిలిప్పీ 4:19 : ..........................................................................

అన్నిటిని మించి బైబిలు మరొక అద్భుతమైన వాగ్దానమునిస్తుంది. "నన్ను బలపరచువానియందే నేను సమస్తమును చేయగలను" (ఫిలిప్పీ 4:13) మనము దేవునిని బలము కొరకు, సహాయము కొరకు అడిగినప్పుడు ఏది మంచిదని దేవుడు తలంచునో దానిని నెరవేర్చమని ఆయనను ప్రార్థించవలెను. దేవునిని ఈ క్రింద పేర్కొనిన వాగ్దానములను నెరవేర్చి ఈ క్రింది విషయాలు అనుగ్రహించమని దేవుని అడుగవలెను.

- మన కుటుంబమును, స్నేహితులను రక్షించమని అడుగవలెను (1తిమోతి 2:3, 4)
- విశ్వాసమును ఇతరులతో పంచుకొనే ధైర్యము కొరకు అడుగుము (ప్రకటన 22:17)
- పాపక్షమాపణ దయ చేయుమని అడగాలి (1యోహాను 1:9)
- దేవుని ధర్మశాస్త్రమును గైకొనుటకు బలమును దయచేయమని అడగాలి (హెబ్రీ 13:20,21).
- మనలను ద్వేషించి గాయపరచు వారిని ప్రేమించునట్లు సహాయము చేయమని అడగాలి (మత్తయి 5:44).

– మన సమస్యలను పరిష్కరించుకొనగలిగే జ్ఞానము దయచేయమని అడిగాలి (యాకోబు 1:5).
– బైబిలును అర్థం చేసుకొనే జ్ఞానము దయచేయమని అడిగాలి (యోహాను 8:32)

## శుక్రవారం ఫిబ్రవరి 13

## అదనపు అధ్యయనం

''మన అవసరతలన్నియు దేవునికి తెలుసు. వాటిని మన దేవుడు అనుగ్రహించుచున్నాడు. ఆయన యొద్ద ధనరాసులున్నవి. మనకు అవసరమైన ప్రతి విషయమును దేవుడు తన ధనరాసులలో నుండి అనుగ్రహించును. అందుచేత దేవునిని మనము ఎందుకు ఇంకా ఎక్కువగా నమ్మకూడదు? తన బిడ్డలకు దేవుని ప్రశస్తమైన వాగ్దానములను చేసెను. దేవునికి విధేయులమైయున్న యెడల ఆ వాగ్దానములను నెరవేర్చును. మనకున్న ప్రతి సమస్యను దేవుడు తీసివేయును. బలహీనులను ఆయన బలవంతులుగా చేయగలడు. మనలో ఉన్న భయాందోళనలను తొలగించగలడు. ఏదైనా మంచి కార్యమును చేయుటకు దేవుడు మనకు సహాయము చేయును.

"అందుచేత మనము మనవైపు చూచుకొనకూడదు. మన పొరపాట్లను గూర్చి ఎక్కువ ఆలోచిస్తే అంత ఎక్కువగా బలహీనపడుదుము. అపుడు మన సమస్యలను పరిష్కరించుకొనుటకు మన సామర్థ్యము సరిపోదు" –ఎలెన్ జి వైట్, "నేను ఆయనను తెలుసుకొనునట్లు" పుట 224.

## చర్చించుకొనుటకు ప్రశ్నలు

1. నీ ప్రార్థనలకు ఇచ్చిన దేవుని జవాబులను గురించి ఆలోచించుము. ఈ అనుభవములు దేవుని యొక్క సమాధానము విషయమై ఏమి బోధిస్తున్నవి. మీ ప్రార్థనలకు దేవుని యొద్ద నుండి వచ్చు జవాబు కొరకు నీవేమి చేయుచున్నావు? నీ హృదయములో దేవుడనుగ్రహించు సమాధానము విషయమై ఆయన చేసిన వాగ్దానమును ఏవిధముగా తలంచుచున్నావు?
2. ఫిలిప్పీ 4:8 చదువుడి. మంచి ఆలోచనలు ఆలోచించుట కొరకు ఈ వాక్యమును చదువుడి. నీవు ఆలోచించే మంచి విషయాలేమిటి? అవి ఏవిధంగా నీ విశ్వాసమును బలముగా చేయుచున్నవి? దేవునితో నీ బాంధవ్యము బలముగా ఉండునట్లు అవి నీకెట్లు సహాయపడును?
3. ఎలెన్ జి వైట్ వ్రాతలనుండి ఎంచుకున్న కొన్ని వాక్యములగూర్చి ఆలోచించుము. మన పొరపాట్లను గూర్చి ఆలోచిస్తే ఎక్కువ బలహీనపడుదుము. అప్పుడు మన సమస్యలను పరిష్కరించుకొనుటకు మనకు బలము సరిపోదు. అట్లయితే వాటిని పరిష్కరించుటకు ఎప్పుడు ఏవిధముగా సాధ్యమగును?

❋✶❋